

# కొత్త పూజను చూస్తారు

కార్‌వాన్ కబుర్లు

**'ఒక లైలా కోసం' సినిమాతో టాలీవుడ్‌కి పరిచయమైన అందం పూజా హెగ్డే. తొలినాళ్లలో కాస్త నిరాశపరిచినా తక్కువ సమయంలోనే స్టార్‌హీరోల సరసన నటించే అవకాశాలు దక్కించుకుని పాన్ ఇండియా స్థాయికి ఎదిగింది. బాలీవుడ్‌లోనూ వరుస అవకాశాలు అందుకుంది. కానీ కొన్నాళ్లుగా సరైన హిట్‌లేక వెనకబడిపోయింది. తాజాగా 'రెట్రో' సినిమాతో మరోసారి తెలుగు ప్రేక్షకుల్ని పలకరించింది పూజ. సినిమా ఫలితం ఎలా ఉన్నా పూజ పాత్రకి మాత్రం మంచి మార్కులే పడ్డాయి. ఇకపై కొత్త పూజను చూస్తారని చెబుతున్న బుట్టబొమ్మ పంచుకున్న కబుర్లు..**

**నా** కెరీర్ 2010లో మిస్ యూనివర్స్ ఇండియా పోటీలో రన్నరప్‌గా నిలిచినప్పటి నుంచి మొదలైంది. తర్వాత, 2012లో తమిళ చిత్రం 'ముగమూడి'తో సినీ పరిశ్రమలో అడుగుపెట్టాను. పదమూడేండ్లుగా ఇండస్ట్రీలో కొనసాగుతున్నాను. నాకు మొదటి అవకాశం ఇచ్చింది తమిళ పరిశ్రమ అయితే, నన్ను నటిగా తీర్చిదిద్దింది మాత్రం తెలుగు సినిమాయే. హిందీలోనూ వైవిధ్యమైన పాత్రలు చేశాను. ఈ ప్రయాణంలో ఎన్నో అనుభవాలు, కొత్త పాఠాలు నేర్చుకున్నా.

**కెరీర్** మొదట్లో ఎలా 'నో' చెప్పాలో తెలియదు. కథ నచ్చకున్నా.. మొహమాటానికి ఒప్పుకొనేదాన్ని. నా అభిప్రాయాన్ని ధైర్యంగా చెప్పలేకపోయేదాన్ని. ఇప్పుడా పరిస్థితుల నుంచి బయటికొచ్చేశాను. నాకు నచ్చిన, నేను పోషించగల పాత్రలకు మాత్రమే ఓకే చెబుతున్నా. నేను నటించిన పాత్రలతోనే నేనేంటో తెలుసుకుంటున్నా. మేకప్ లేకుండా సహజంగా ఉండే పాత్రల్లో కనిపించాలని ఉంది. కేవలం గ్లామర్ కోసం కాకుండా, కథకు బలాన్ని చేకూర్చే పాత్రలు చేయాలని ఉంటుంది.

**మంచి కథ** కోసం వెయిట్ చేస్తున్నాను. ఇప్పటిదాకా నా వరకు వచ్చిన స్టోరీల్లో ఒక్కటి కూడా నచ్చలేదు. ఏదో ఒకటి చేసేద్దాంలే అని కాకుండా ప్రేక్షకుల కోసం ఏదైనా కొత్తగా ట్రై చేద్దాం అనుకుంటున్నాను. ఇటీవలే ఒక తెలుగు సినిమాకు సైన్ చేశాను. ఈ చిత్రంలో కొత్త పూజను చూస్తారు.

నాకు దక్షిణాది, ఉత్తరాది అనే భేదం లేదు. నా కోసం ప్రత్యేకంగా సినిమాలు నిర్మించే వ్యక్తి లేరు. ఒక సినిమా ఫ్లాప్ అయినా మళ్లీ నన్ను నమ్మి అవకాశమిస్తారో వారే నాకు ముఖ్యం. ప్రతిభ ఉంటే ప్రేక్షకులు తప్పకుండా అభిమానిస్తారని నమ్ముతాను. భాష ఏదైనాసరే, నాకు మంచి పాత్రలు పోషించడం ముఖ్యం.

ఎన్నో సక్సెస్‌ఫుల్, కమర్షియల్ చిత్రాల్లో నటించాను. కానీ, ఇప్పటివరకు బయోపిక్‌లో నటించలేదు. స్వాతంత్ర్య పోరాట యోధుల కథల్లో భాగమవ్వాలని ఉంది. క్రీడా నేపథ్య చిత్రాల్లో కూడా నటించాలనుకుంటున్నా. మహిళా ప్రాధాన్యం ఉన్న స్ఫూర్తిదాయకమైన కథలు సినిమాలుగా రావాల్సిన అవసరం ఉంది.

**నేను తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లిష్, మరాఠి, కన్నడ, తుళు భాషలు మాట్లాడగలను. వివిధ సినిమా ఇండస్ట్రీల్లో పాత్రలు పోషించడానికి, స్థానిక ప్రేక్షకులతో అనుబంధం పెంచడానికి భాష చక్కగా సాయపడుతుంది.**

**నేను** నటించిన అన్ని సినిమాల్లో 'అల వైకుంఠపురములో' నాకు ప్రత్యేకం. నాకు సైమా అవార్డు తెచ్చిపెట్టిన సినిమా అది. అల్లు అర్జున్‌తో కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంది. త్రివిక్రమ్ శ్రీనివాస్ గారి డైరెక్షన్‌లో పనిచేయడం ఇష్టం.